క్లుప్తంగా

మార్గశిర మాస పూజలు


పసుపు కొమ్ముల అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

బొండపల్లి: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా అంబటివలస గ్రామంలోని రామాలయంలో లక్ష్మీదేవికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్‌సీఎం పాఠశాలలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ మోహనరావు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలోని ఆర్‌సీఎం పాఠశాలలో బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బి.మోహనరావు గురువారం తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. స్కూల్‌లో తరగతుల వారీగా ఎంతమంది విద్యార్థులున్నారు, వారికి బోధించేందుకు ఎంతమంది ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారని ప్రిన్సిపాల్ శాంతి సిస్టర్‌ను ఆరా తీశారు. అలాగే విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

లోగిశలో వైద్య శిబిరం


సేవలందిస్తున్న వైద్యాధికారి పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని లోగిశ గ్రామ సచివాలయంలో గురువారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి, వైద్య సిబ్బందితో కలిసి 44 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. అనంతరం గృహ సందర్శన చేసి శిబిరానికి రాలేని వృద్ధులు, గర్భిణులకు వైద్యతనిఖీలు చేశారు.

రేపే సాగు నీటి సంఘాలకు ఎన్నికలు


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్

దత్తిరాజేరు: మండలంలో 22 సాగునీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహించ నున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఓటర్లు నిబంధనలు పాటించాలని, పోలింగ్ స్టేషన్‌లోకి సెల్ ఫోన్లు అనుమతించేది లేదని తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవం కాని పక్షంలో ఓటరు స్లిప్పులు అందజేసి బ్యాలెట్ విధానంలో రహస్య పద్ధతిలో ఎన్నిక జరిపిస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఉదయం 8 గంటలకే సిబ్బంది చేరుకోవాలని సూచించారు.

కేజీబీవీ సందర్శన


కేజీబీవీ స్టాక్ రూమ్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఎంఈఓ బాల భాస్కరరావు గురువారం సందర్శించారు. వసతి గృహ పరిసరాలు, కిచెన్, వంట సామగ్రి, కూరగాయల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడారు.పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారని ఆరా తీసి పలుసూచనలు చేశారు. రోజు వారీ ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని, సబ్జెక్టుల వారీగా షెడ్యూల్ రూపొందించుకుని చదువుకోవాలని, ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయినులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఏటీఎంపీ-1 హిందీ పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎస్ఓ లక్ష్మి, ఉపాధ్యాయినులు కె.నీలవేణి, తదితరులున్నారు.

ఉత్తుత్తి హామీలేనా...!

- హామీలు ఇచ్చారు..అమలు మరిచారు
- ఇంకా అటక మీదనే సూపర్ సిక్స్ హామీలు
- చీపురుపల్లిలో ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ
- ఆంధ్రా ఫెర్రో పరిశ్రమ తెరిపిస్తామని ఎమ్మెల్యే కళా హామీ
- కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా అమలు కాని హామీలు


చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం


గర్భాం ఆంధ్రాఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ

చీపురుపల్లి: అధికారం కోసం ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించి ప్రజలను ప్రలోభ పెట్టడం ..తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అటకెక్కించడం చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి కొత్తేమీ కాదు. 2014లో ప్రజలకు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ హామీలను అమలు చేయకుండా మోసం చేశారు. దీంతో 2019లో ఆయన్ని ఓడించారు. మళ్లీ 2024లో సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చారు. అలాగే నియోజకవర్గాల్లో సమస్యలనూ పరిష్కరించేస్తామని మైకులు పట్టుకుని ఊదరగొట్టారు. 2014లో మోస పోయినప్పటికీ ప్రజలు మరోసారి చంద్రబాబుకు అవకాశం ఇచ్చారు.

పరిశ్రమను తెరిపించాలి



గర్భాం ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ మూతపడి చాలా సంవత్సరాలు కావస్తోంది. పరిశ్రమలో పని చేసిన 500 మంది కార్మికుల కుటుంబాలు ఉపాధి లేక చాలా దీనావస్థలో బతుకుతున్నారు.ఇప్పటికైనా పరిశ్రమను తెరిపించి కార్మిక కుటుంబాల ఆకలి తీర్చాలి. తాము అధికారంలోకి వస్తే పరిశ్రమను తెరిపిస్తామని ఎన్నికల సమయంలో ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు, కూటమి అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కళా వెంకటరావు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– సత్తారు శ్రీనివాసరావు, గర్భాం గ్రామం, మెరకముడిదాం

ప్రజల అంచనాలు తప్పంటూ చంద్రబాబు తన పాతపద్ధతిలోనే ఇప్పుడూ మోసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడంతో ఎవరి నోట విన్నా మోసపోయామనే మాట వినిపిస్తోంది. హామీలు ఇవ్వడం, మరచిపోవడం చంద్రబాబుతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలకు అలవాటేనని అంతటా చర్చించుకుంటున్నారు.ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కూడా ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు బాటలోనే చీపురుపల్లి నియోజకవర్గ ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. కానీ ఆ హామీలను అమలు చేయాలనే ఆలోచనే ఎమ్మెల్యే ఇంతవరకు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఈసీఎస్ పునరుద్ధరణ ఏమయ్యింది....?

ఏపీఈపీడీసీఎల్‌లో విలీనమై కార్యకలాపాలు సాగిస్తున్న గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్‌ఈసీఎస్)ను తిరిగి ఆర్‌ఈసీఎస్‌గా కొనసాగిస్తామని దాని కోసం కూటమి ప్రభుత్వం రాగానే చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని ఎన్నికల సమయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా కళా వెంకటరావు హామీ ఇచ్చారు. అంతేకాకుండా 2024 మే 9న ఎన్నికల ప్రచారంలో భాగంగా చీపురుపల్లి వచ్చిన ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడుతో కూడా బహిరంగ సభలో ఇదే విషయాన్ని చెప్పించారు. సాక్షాత్తూ చంద్రబాబే ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆ ఊసే లేదు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే కళా వెంకటరావు అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ సంగతేంటి...?

నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలోని గర్భాం వద్ద ఉన్న ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ దాదాపు పదేళ్లుగా మూతపడి ఉంది. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా 500 కుటుంబాలు, పరోక్షంగా వెయ్యి కుటుంబాల వరకు ఆధారపడి జీవించేవి. ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా ఆ మండలానికి వెళ్లిన కళా వెంకటరావు తాము అధికారంలోకి రాగానే ఆంధ్రా ఫెర్రో పరిశ్రమను తెరిపించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ కనీసం పరిశ్రమ తెరిపించేందుకు యాజమాన్యంతో చర్చలు కూడా జరిపిన పాపాన పోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు నీరు కూడా ఇవ్వలేకపోయారు..!

చీపురుపల్లి నియోజకవర్గంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువకు సంబంధించి పిల్ల కాలవ పనులు పూర్తవ్వకపోవడంతోనే సాగు నీరు పూర్తి స్థాయిలో అందడం లేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తామని ఎన్నికల ముందు కళా వెంకటరావు హామీ ఇచ్చారు. పనులు పూర్తిచేయడం పక్కనపెడితే.. ప్రతి ఏటా కుడి ప్రధాన కాలువ ద్వారా వచ్చే సాగు నీరు కూడా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రాని దుస్థితి నెలకొంది.

సాగు సాయమేది..?



- అన్నదాతకు అందని పెట్టుబడి సాయం, వ్యవసాయ పరికరాలు
- విత్తనాలు, ఎరువుల కోసం ఇక్కట్లు

దత్తిరాజేరు: అన్ని వర్గాలతో పాటు అన్నదాతలను కూడా కూటమి ప్రభుత్వం దగా చేస్తోంది. ఎన్నికల్లో రైతు సంక్షేమం కోసం ఇచ్చిన హామీల అమలును విస్మరించడమే కాకుండా గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను కూడా నిలిపివేయడంతో ఏం చేయాలో తెలియని అయోమయంలో అన్నదాత ఉన్నాడు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ప్రభుత్వం కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు.అలాగే గతంలో ఏటా వ్యవసాయశాఖ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీపై టార్పాలిన్లు , స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్లు ఇచ్చేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా రాయితీపై పరికరాలు అందలేదు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా పథకం ఏడాదికి రూ. 13,500 ఆర్థిక సాయం అందేది. ఏడాదిలో మూడు సార్లు రైతు బ్యాంక్ ఖాతాకు నగదు జమయ్యేది. ఇలా గత ప్రభుత్వంలో గజపతినగరం నియోజకవర్గ రైతులకు రూ.312.67 కోట్ల సాయం అందింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో రైతు భరోసా పథకాన్నే అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్చి రైతులకు ఏడాదికి రూ. 20 వేల చొప్పున అందిస్తామని చంద్రబాబుతో సహా కూటమి నాయకులంతా హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేస్తున్నా, కూటమి ప్రభుత్వం తనవంతు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అన్నదాతలకు అందని సేవలు

అన్నదాతల సంక్షేమం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పెట్టుబడి సాయం నుంచి, పంటల సాగు, మార్కెటింగ్ వరకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలిచింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు గ్రామాల్లోనే అందించే వారు. పంటలసాగుకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు అందించేవారు. లక్షల రూపాయలు వెచ్చించి రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) కియోస్క్(డిజిటల్ టచ్ స్క్రీన్)యంత్రాలను ఏర్పాటు చేసి డిజిటల్ సేవలను అందించేవారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను రైతులు ఆన్‌లైన్‌లో కొనుగోలుచేసుకునే వారు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న ధరల వివరాలను కియోస్క్ ద్వారా తెలుసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సేవలు నిలిచిపోయాయి.

మోసం చేయడం చంద్రబాబు నైజం



నమ్మించి మోసం చేయడం చంద్రబాబు నైజం. రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ ముగిసి పోయి, రబీ సీజన్ ప్రారంభమైనా ఇంకా పెట్టుబడి సాయం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఎరువులు,పురుగులు మందులు ఆర్బీకేల్లో అందించే వారు. పెట్టుబడి సాయం కింద రూ.13,500 ఇచ్చే వారు. ఈ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వలేదు సరికదా.. ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కూడా అందించ లేకపోతోంది.

– చుక్క మురళి, రైతు, చుక్కపేట, దత్తిరాజే మండలం

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి


దత్తిరాజేరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్


గంట్యాడ: గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పించి, శిక్షణ ప్రారంభిస్తున్న ఎంపీపీ హైమావతి


మెరకముడిదాం: సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న ట్రైనీలు

అన్ని విషయాల్లో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని గంట్యాడ ఎంపీపీ పీరుబండి హైమావతి, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, దత్తిరాజేరు, గజపతినగరం, మెరకముడిదాం మండలాల ఎంపీడీఓలు రాజేంద్ర ప్రసాద్, బి.కల్యాణి, మెరకముడిదాం ఎంపీడీఓ జి.భాస్కరరావు అన్నారు.పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ప్రజారోగ్యం, పంచాయతీ నిధుల వినియోగం, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, పేదరికం నిర్మూలన తదితర అంశాలపై మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీలు, దత్తిరాజేరు వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

– గంట్యాడ/దత్తిరాజేరు/గజపతినగరం/మెరకముడిదాం

సూర్యఘర్‌ను సద్వినియోగించుకోండి


మాట్లాడుతున్న ఈఈ సురేష్‌బాబు

కొత్తవలస: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు సూచించారు.ఈ పథకంపై దేశపాత్రునిపాలెం గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇళ్ల స్లాబ్‌లపై సోలార్ రూఫ్‌టాప్ వేసుకునేందుకు కేంద్రప్రభుత్వం రాయితీ ఇస్తోందని చెప్పారు. ఒక కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుందని, 2 కిలో వాట్లకి రూ.60 వేలు, 3కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ డీఈఈ బి.వెంకటరావు, సహాయ ఇంజినీరింగ్ అధికారులు ఐ.అప్పారావు,ఆర్.రవి, సీహెచ్.సూరిబాబు, పీఎం సూర్యఘర్ డీలర్లు జి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు

భూసమస్యలకు త్వరితగతిన పరిష్కారం


గజపతినగరం: పాతబగ్గాంలో రెవెన్యూ సదస్సుకు హాజరైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ


వేపాడ: ఆతవలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు


బొండపల్లి: బొండపల్లిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

గజపతినగరం: రైతుల భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ తెలిపారు. మండలంలోని పాత బగ్గాం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ భూసమస్యలున్న రైతులు అర్జీలు అందజేస్తే రెవెన్యూ అధికారులు వాటిని పరిష్కరిస్తారని చెప్పారు. పలువురు రైతులు అడంగల్ కరక్షన్, మ్యుటేషన్ల కోసం అర్జీలు అందజేశారు. తహసీల్దార్ బి.రత్నకుమార్, డిప్యూటి తహసీల్దార్ శోభారాణి, సర్పంచ్ లెంక పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో పరిష్కరిస్తాం

బొండపల్లి: భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందుతున్న అర్జీలను పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రమైన బొండపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి,రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వీఆర్‌ఓ కె.ప్రభాకరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

వేపాడ: భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ సూచించారుజ. ఆతవ గ్రామంలో తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 12 అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ వేమననాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.విద్యుత్ లైన్లకు అనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో సదానందపురం, వల్లాపురం, గొలగాం, దమరసింగి, శేషపుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీ

దత్తిరాజేరు: రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రం విజయనగరంలో శుక్రవారం నిర్వహించనున్న నిరసన ర్యాలీకి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు కోరారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జునతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉదయం 10 గంటలకు నెహ్రూ యువ కేంద్రం వద్దకు చేరుకోవాలని కోరారు.

భవితలో ఫిజియోథెరపీ సేవలు


ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న హిమబిందు

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ దుగ్గిరాల హిమబిందు గురువారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల సేవలను ప్రత్యేక అవసరాల పిల్లలు సద్వినియోగించుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. కేంద్రంలో విద్యతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలు అందిస్తున్నట్లు కేంద్రం ఐఈఆర్‌టీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ తెలిపారు.

ఆర్థిక సహాయం



చెల్లాపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఆరిపాక అప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఉపాధి హామీ పథకం సిబ్బంది గురువారం ఆర్థిక సహాయం చేశారు. మండల ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్ర కుమార్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు రాజాం, రేగిడి ఆమదాలవలస మండలాల ఉపాధి సిబ్బంది రూ.43 వేల సహాయం అందించారు. గ్రామపెద్ద రెడ్డి వరం, తదితరులు పాల్గొన్నారు.

– మెరకముడిదాం

గంటానకు 'గద్దర్' అవార్డు



నిరంతరం ప్రజా ఉద్యమాల్లో ఉంటూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న రావివలస గ్రామానికి చెందిన ఉద్యమ నేత గంటాన అప్పారావుకు ప్రజాయుద్ధనౌక గద్దర్ అవార్డు లభించింది. అంబేడ్కర్ జిల్లా పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతులు మీదుగా అప్పారావు అవార్డు అందుకున్నారు.

–చీపురుపల్లి

భగవద్గీత సారాన్ని తెలుసుకోవాలి



చీపురుపల్లిలోని కొత్తగవిడివీధి ఉన్న గీతా మందిరంలో నాలుగు రోజులుగా నిర్వహించిన గీతా జయంతి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాల ముగింపు రోజున అతిథులు, ఉత్సవాలకు హాజరైన పట్టణ వాసులకు నిర్వాహకులు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీతలోని సారాన్ని తెలుసుకోవాలన్నారు.

– చీపురుపల్లి

ధాన్యం విక్రయానికి ఇబ్బందులు

గుర్ల: మండలంలోని మణ్యపురిపేట రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలులో ధాన్యం విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ బడుగంటి హైమావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బడుగంటి వెంకటరమణ ఆరోపించారు. గురువారం వారు మణ్యపురిపేటలో విలేకరులతో మాట్లాడుతూ కల్లాల్లో ఉన్న ధాన్యం తేమ శాతం చూడడానికి కూడా రైతు సేవా కేంద్రం సిబ్బంది , పీఏసీఎస్ అధికారులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రానికి వస్తేనే ధాన్యం కొనుగోలు చేస్తామని సిబ్బంది చెప్పడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వద్దకే అధికారులు వచ్చి ధాన్యం కొనుగోలు చేసేలా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

జోనల్ స్థాయి క్రీడలకు ఏర్పాట్లు

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలోని క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంబళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించారు. ఈ నెల 26, 27 తేదీల్లో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు.